తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

రైతు సంతోషంతోనే రాష్ట్రం సుభిక్షం: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్ : రైతు సంతోషమే రాష్ట్రానికి సుభిక్షమని, ఆ లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆర్థికంగా ఎంత భారమైనా వెనకడుగు వేయకుండా రైతు భరోసా నిధులు పంపిణీ చేసి మరోసారి అన్నదాతలపై కాంగ్రెస్ పార్టీ నిబద్ధత చాటుకుందని మంగళవారం ఆయనొక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధితోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందనే విశ్వాసంతో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 229 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | గురువారం, జులై 02, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

గ్రేటర్ హైదరాబాద్ లోని నిరుపేదలకు తీపికబురు..



7 చోట్ల మీకు ఇందిరమ్మ ఇళ్ళు!

ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేయటానికి సంకల్పించిన తెలంగాణా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా పేదలకు శుభవార్త చెప్పింది. గూడు లేని వారికి గూడు కల్పించే పనిలో ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రతీ జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో ఇళ్ళ నిర్మాణాలు, గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇక తాజాగా హైదరాబాద్ లో ఇల్లు లేని నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. నిరుపేదలఇళ్ళ కోసం ప్రభుత్వ కసరత్తు ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా భూముల గుర్తింపు పనులు తీవ్రంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలతో రెవెన్యూ మరియు గృహనిర్మాణ శాఖల అధికారులు ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్నారు. వివాదాలు లేని ప్రభుత్వ భూములను ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే నగరంలోని ఏడు ముఖ్య ప్రాంతాల్లో స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి కావడం గమనార్హం. ఈ ప్రాంతాల్లో ఇళ్ళ నిర్మాణానికి ప్లాన్ నాంపల్లి నియోజకవర్గంలోని కుల్సుంపురలో 4.3 ఎకరాల్లో 620 ఇళ్ల టవర్ నిర్మాణం, మల్లేపల్లిలో 4.20 ఎకరాల్లో 680 ఫ్లాట్లు, రెడ్‌హిల్స్‌లో 2 ఎకరాల్లో 270 ఫ్లాట్లు నిర్మించనున్నారు. మలక్‌పేటలో ఓల్డ్ క్వార్టర్స్ ఆర్‌బీ కాలనీలో 4.7 ఎకరాల్లో 630 ఫ్లాట్లు, గడ్డిఅన్నారంలో 9.11ఎకరాల్లో 1,400 ఫ్లాట్లు, బహదూర్‌పురలో ఫారూఖ్‌నగర్‌లో 4 ఎకరాల్లో 600 ఫ్లాట్లు, కూకట్‌పల్లిలో 5 ఎకరాల హౌసింగ్ బోర్డు స్థలంలో ఇళ్ల నిర్మాణం చేయటానికి నిర్ణయించారు . ఈ ప్రాంతాలలో స్థలాలు అధికారికంగా గుర్తింపు మిగతా నియోజకవర్గాల్లో కూడా భూముల గుర్తింపు కొనసాగుతోంది. మేడ్చల్‌లో పోచారం ఎల్‌ఐజీ కాలనీ, ఖైరతాబాద్‌లో హకీంపేట్ దర్గా ప్రాంతం, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, మల్కాజిగిరి, రాజేంద్రనగర్, ఉప్పల్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో స్థలాలను అధికారులు గుర్తించారు. బండ్లగూడలోని తట్టిఅన్నారం, ఫతుల్‌గూడ వంటి చోట్ల ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూములను వినియోగించనున్నారు. హైదరాబాద్ లో అర్హులైన పేదలకు సొంతిల్లు ఈ పథకం ద్వారా హైదరాబాద్‌లోని అర్హులైన పేదలు, కార్మికులు, నిర్మాణ కార్మికులు వంటి వర్గాలు బహుళ అంతస్తుల ఇళ్లలో సొంత నివాసం పొందుతారు. వివాదాలు లేని స్థలాలను మాత్రమే ఎంపిక చేయడం ద్వారా నిర్మాణం విషయంలో ఇబ్బంది ఎదురు కాదని భావిస్తున్నారు. ంశ్రీబనీ ఖీవజీట టీటీడీ తరహాలో యాదాద్రి బోర్డు.. చైర్మన్ గా ప్రముఖ పారిశ్రామికవేత్త, చిరంజీవి సతీమణికి స్థానం త్వరలో వీరికి సొంతిల్లు అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి నివేదికను త్వరలో సమర్పించనున్నారు. దీని తర్వాత ఆయా ఎంపిక చేసిన స్థలాలలో పేదలకు ఇళ్ళ నిర్మాణం చేపడతారు. అయితే స్థలం లేని నిరుపేదలు కావటం తో వీరికి బహుళ అంతస్తుల భవనాలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇస్తారు.

ప్రజా పథకాలపై ప్రత్యేక దృష్టి

మంత్రిత్వశాఖల కార్యదర్శులతో మోదీ



దిల్లీ: వ్యాపారాన్ని, ప్రజల జీవనాన్ని సరళతరం చేయడానికి, న్యాయం నమృద్ధిని ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన నంన్కరణలను ప్రధాని నరేంద్రమోదీ సమీక్షించారు. ప్రజల జీవితాలపై స్పష్టమైన ప్రభావం కనిపించే పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఈ మూడు అంశాలపై కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రెండు నెలల వ్యవధిలో ఇలా ఉన్నతాధికారులతో ఆయన నమావేశం కావడం ఇది రెండోసారి. నియంత్రణల తొలగింవు, ఇతరత్రా తీసుకురావాల్సిన సంస్కరణలపై చర్చ ప్రధానంగా సాగింది. ప్రధాని దార్శనికతను కార్యరూపంలోకి తీసుకురాదగ్గ చర్యలుగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్యదర్శులు వివరించారు. ఆయా రంగాలకు ఎదురవుతున్న సవాళ్లు, సేవల అందజేతకు తమ వ్యూహాలను ప్రధానికి తెలిపారు. శాఖలవారీగా ఎవరికివారు గిరి గీసుకుని కూర్చోవడం కాకుండా ప్రభుత్వం యావత్తు ఒకటే అనే రీతిలో పనిచేయాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. శాఖల మధ్య సమన్వయానికి, ఒకరి నిర్ణయాలను ఒకరు తెలుసుకునేందుకు 'పీఎం గతిశక్తి'ని వినియోగించుకోవాలని తెలిపారు.

హర్మూజ్‌లో స్వేచ్ఛా రవాణా ఎంతో ముఖ్యం

హర్మూజ్ జల సంధిలో స్వేచ్ఛా రవాణా భారత్‌తోపాటు ప్రపంచానికి ఎంతో ముఖ్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అన్ని సమస్యలనూ చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలన్న భారత్ వైఖరిని మరోసారి నొక్కి చెప్పారు. మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఆయన ఫోన్‌లో సంభాషించారు.

మూడు కొత్త ఎయిర్‌పోర్టులు..

ఏరోస్పేస్, డిఫెన్స్ గ్లోబెల్ హబ్ గా తెలంగాణ!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం కొత్త కార్యాచరణ చేపట్టిందని ప్రకటించారు. తెలంగాణను ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏరోమార్ట్ 2026 సదస్సులో మంత్రి కీలకవ్యాఖ్యలు రాష్ట్రంలో మూడు కొత్త విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ 2026 సదస్సులో మాట్లాడిన మంత్రి ఈ కీలకవ్యాఖ్యలు చేశారు. వచ్చే నెలలో వరంగల్ ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచే లక్ష్యంతో ఆదిలాబాద్‌లో పౌర మరియు సైనిక అవసరాల కోసం సంయుక్త విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తెలంగాణా అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో కొత్త ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరలో లభించనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణను ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు ఏరోస్పేస్, రక్షణ రంగాలకు సంబంధించిన విడిభాగాలు తయారు చేస్తున్నాయని చెప్పారు. యూఎస్, యూకే వంటి దేశాల సంస్థలు తెలంగాణాలో పెట్టుబడులు అమెరికా, యూకే, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, జపాన్ వంటి దేశాల సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో టాటా సికోర్స్కీ, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి దిగ్గజ సంస్థలు అత్యాధునిక హెలికాప్టర్లు, ఫైటర్ జెట్ల విడిభాగాలు తయారు చేస్తున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. సఫ్రాన్, జీఈ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఇంజన్ భాగాలు, మెయింటెనెన్స్ సేవలు అందిస్తున్నాయని వివరించారు. ంశ్రీబనీ ఖీవజీట గ్రేటర్ హైదరాబాద్ లోని నిరుపేదలకు తీపికబురు.. 7 చోట్ల మీకు ఇందిరమ్మ ఇళ్ళు! కొత్త విమానాశ్రయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతం జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఇటీవల జరిగిన శంకుస్థాపనలు రాష్ట్రం ఏరోస్పేస్ రంగంలో సాధిస్తున్న పురోగతికి నిదర్శనమన్నారు. ఈ కొత్త విమానాశ్రయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలపరుస్తాయని, ఉపాధి అవకాశాలను పెంచుతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.ఏరోమార్ట్ 2026 సదస్సులో జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు డా. జి. సతీష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారతదేశం ఏరోస్పేస్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, హైదరాబాద్ ఈ ఎకోసిస్టమ్‌లో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

ఎన్నికలు పెడితే కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలవదు

నితిన్‌నబిన్ పర్యటనతో శ్రేణుల్లో జోష్: ఏలేటి



హైదరాబాద్: భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్ మూడు రోజుల పర్యటన భాజపా శ్రేణుల్లో జోష్ నింపిందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన వ్యవసాయంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ బలపరచగా అనంతరం ఆమోదించారు. తర్వాత మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "రాజకీయ తీర్మానంతోపాటు పన్నెండేళ్ల మోదీ పాలనపై ధన్యవాద తీర్మానం, రైతు సమస్యలపై తీర్మానాలను ఈ సమావేశంలో ప్రవేశపెట్టాం. నితిన్ నబీన్ ఇచ్చిన పిలుపు మేరకు మేమంతా కలిసికట్టుగా ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవదు' అని పేర్కొన్నారు. సత్తా ఉంటే ప్రభుత్వాన్ని రద్దుచేసి ఎన్నికలకు రావాలంటూ సవాల్ విసిరారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడి పర్యటనతో కాంగ్రెస్ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు.

ముగిసిన పర్యటన

రాష్ట్రంలో నితిన్ నబీన్ మూడు రోజుల పర్యటన మంగళవారంతో ముగిసింది. విస్తృతంగా వర్యటించిన ఆయన.. రాష్ట్ర అధ్యక్షుడి నుంచి కేంద్ర మంత్రులు, కీలక నేతలతో పాటు నాలుగు కార్పొరేషన్ల బూత్ ఇన్‌ఛార్జుల వరకు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అంతర్గత సమావేశాలు నిర్వహించి పార్టీ పరిస్థితిని తెలుసుకున్నారు.

ఢిల్లీలో ఇజ్జత్ లేకపోతే ఎందుకు పోతున్నవ్..

నువ్వు నడుపుతున్న రాష్ట్రాన్ని నువ్వే తిట్టడం ఏం దరిద్రం : కేటీఆర్



ఒక అల్పుడు.. స్టీ రామారావు చెప్పినట్టు ఒక అంగుష్ఠ మాత్రుడు.. ఒక తుచ్చుడు ఈ రోజు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల, ఈ రాష్ట్రం దురదృష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎంతటి అల్పుడైనా.. ఎంతటి తుచ్చుడైనా నిజానికి నేను దరిద్రుడిని అనే మెడలో బోర్డు వేసుకుని తిరుగడు. కానీ రేవంత్‌రెడ్డి స్పెషాలిటీ ఏంటంటే ఆయన మైకు మీదనే నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటడన్నారు.దివాళా తీశాం.. దివాళా తీశాం.. ఒక్కసారి కాదిది. రెండున్నరేళ్లలో ఒకసారి తెలంగాణను ఎయిడ్స్ రోగి అంటడు. ఇంకోసారి క్యాన్సర్ పేషంట్ అంటడు.. దివాళా తీసిందని మాట్లాడిన దివాళాకోరు మాటలకైతే లెక్కనే లేదు. అది చూసిన తర్వాతనే బాధ అనిపించింది. వాస్తవమేంటంటే ఇంతటి భావదారిద్ర్యం బహుశా దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రిలో కూడా ఎన్నడూ చూసి ఉండం. మీ అదృష్టం బాగుంది.. జాక్‌పాట్ కొట్టారు. ప్రజలు మార్పు అని మీరు చెప్పిన డైలాగులు విశ్వసించారు. మీకు అవకాశం ఇచ్చారు. 30 నెలలు అయిపోయింది.. మీ పరిపాలనకు 50 శాతం మీకిచ్చిన అవకాశం అయిపోయింది.. ఇప్పటికైనా ప్రజలకు మీ ప్రభుత్వంలో మీరేం చేశారో నాలుగు మంచి మాటలు చెప్పండని కేటీఆర్ హితవు పలికారు.ప్రజలకు మీరిచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు. లేదంటే ఒక జిల్లాకు పోతే ఆ జిల్లాకు మీరు చేసిన అభివృద్ధి.. మీ వల్ల జరిగిన మంచి పనులు అవి చెప్తారేమో అని చూస్తున్నం. కానీ ఇంత రాజకీయ భావదారిద్ర్యం, ఇంత విచిత్రమైన పరిస్థితి భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఏ నాయకుడు కూడా ఇలా ఉండడు.. ఎంతో మందిని చూశాం.. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులను చూశాం.. కానీ ఎవరిలో కూడా ఇంతటి భావదారిద్ర్యం మేమైతే చూడలేదు. తింటున్న అన్నంలోనే మన్ను పోసుకున్నట్టు.. తింటున్న అన్నంలోనే ఊంచినట్టు నువ్వు నడుపుతున్న రాష్ట్రాన్నే తిట్టడం ఏం దరిద్రం. ప్రభుత్వానికి అధినేత, రాష్ట్రానికి ముఖ్యమంత్రి నువ్వు. ఇంకా ఎన్ని రోజులు ఆ విషం చిమ్మే పని మాకైతే అర్థం కావడం లేదన్నారు.ల్లీకి పోతే ఇజ్జత్ లేదు.. అక్కడ గౌరవం లేదని ఆయనే చెప్తడు.

ఒక్క ఓటు పోకుండా కాంగ్రెస్ పార్టీ కాపాడుకుంటుంది: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఓటరు సవరణ జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే కాంగ్రెస్ పార్టీ అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు పోకుండా కాపాడుకుంటుందని, ఎన్నికల కమిషన్ బిఎల్ఓలతో సమాంతరంగా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలను నియమించిందన్నారు. ఈ సందర్భంగా బిఎల్ఎలు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు కోల్పోకుండా సమన్వయం చేస్తున్నారని తెలియజేశారు. ఇటీవల ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో బీహార్ పశ్చిమబెంగాల్ లో లక్షలాది ఓట్లు తొలగించారని, అక్కడ ఫలితాలు తారుమారయ్యాయని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్న బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని, ఇక్కడ కూడా అలాంటి అవకాశం జరిగే పరిస్థితి ఉందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామిక వాదులు రాజకీయ వాదుల ఓట్లు కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని పొన్నం పిలుపునిచ్చారు. గతంలో 2002లో ఓటరు సవరణ జరిగినప్పుడు అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు కోల్పోకుండా ఎన్నికల కమిషన్ ప్రభుత్వాలు భావించాయని, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ పై అనేక ఆరోపణలు వస్తున్నాయని, ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీ అనుబంధంగా మారిందని పొన్నం మండిపడ్డారు.

రేవంత్ పాలనలో ఉప్పల్ కు అభివృద్ధి వరాలు

మందముల పరమేశ్వర్ రెడ్డి

మేడ్చల్,ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. చెరువు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, మౌలిక వసతుల పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, పర్యావరణ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉప్పల్, నాచారం హెచ్ఎంటీ, కాప్రా, రామంతపూర్ పెద్ద చెరువుల అభివృద్ధికి తొలి దశలో రూ.104 కోట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. రెండో దశలో ఉప్పల్ నియోజక వర్గంలోని మిగిలిన చెరువులను అభివృద్ధి చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి రూ.40 కోట్లు, ఉప్పల్?నారపల్లి ఎలివేటెడ్ కారిడార్కు వేగం, అలాగే డ్రైనేజీ, కల్వర్టులు, రోడ్ల అభివృద్ధితో ఉప్పల్ రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.అడిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజక వర్గానికి నిధులుకేటయిస్తున్నారని స్వయంగా ఉప్పల్ నియోజక బీఆర్ఎస్ శాసన సభ్యులు బరిరంగంగా ఒప్పుకోవడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంది ఆగిరెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి, బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, గన్నారం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత : మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



చందంపేట, జులై 01 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన అంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం కేసీఆర్ విశేష కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కారు నిర్విరామంగా కృషి చేసినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల్లో ధూప, దీప, నైవేధ్యాల కోసం ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.6 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకున్నదన్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పున:నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను, కామన్ గుడ్ ఫండ్ నిధులతో ఇతర ఆలయాల జీర్ణోద్ధరణ, దేవాలయాల నిర్మాణ పనులను శరవేగంగా కేసీఆర్ సర్కార్ చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ విశేష కృషి చేసిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, కేతవత్ శంకర్ నాయక్, సర్పంచ్ సత్యనారి, రామావత్ మోహన్ కృష్ణ, కేతావత్ రమేష్, లోటావత్ బీమా నాయక్, దాసు భావోజీ, ఉప సర్పంచ్ అను అతిరాం, ఫకీరా నాయక్, కేతావత్ హేము నాయక్, మంగ్య నాయక్, చందర్, లక్క, జబ్బర్, బిచ్చు, మంగతా, భాషా, జైల్ సింగ్, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులపై తేనెటీగల దాడి.. పలువురికి గాయాలు

ఓదెల, జులై 1 : పెద్దపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో బుధవారం భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. బుధవారం మల్లన్న జాతర కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కాగా ఇక్కడ స్వామివారికి నైవేద్యం పెట్టడానికి కట్టెల పొయ్యిలతో బోసం వంటలు చేశారు. కట్టెల కట్టెల పొయ్యిలతో వెలువడిన పొగతో చెట్లపై ఉన్న తేనెటీగలు లేచి భక్తులపై దాడికి దిగాయి.దీంతో భక్తులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. పిల్లలు, మహిళలు రక్షణ కవచంగా దుస్తులను ఒంటిపై కప్పుకొని ఆలయానికి దూరంగా పరిగెత్తారు. కొంతమంది భక్తులకు తేనెటీగలతో గాయాలు అవడంతో 108 వాహనంలో దావకానకు తరలించారు. ఇక్కడ కొంతకాలంగా చెట్లపై తేనెటీగలు ఉన్నాయని తెలుపుతున్న ఎవరూ పట్టించుకోకపోవడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు భక్తులు పేర్కొంటున్నారు.



గోవధపై సుప్రీంకోర్టుకు తమిళనాడు ప్రభుత్వం..

మద్రాస్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పిటిషన్

గోవధపై నిషేధం విషయంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంలో గోవధను నిషేధిస్తూ గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు సెక్రెటరీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మద్రాస్ హైకోర్టు తీర్పు.. తమిళనాడు యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్, 1958కి వ్యతిరేకంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది.తమిళనాడు చట్టం ప్రకారం పదేళ్లు దాటిన గోవులను, సంతానోత్పత్తికి పనికిరాని గోవులను, వ్యవసాయం వంటి వాటిలో పనికి ఉపయోగపడని వాటిని వధించవచ్చు. దీనికి సంబంధిత అథారిటీ నుంచి సర్టిఫికెట్ తీసుకుంటే చాలు. అలాగే, ఇతర కేంద్ర చట్టాలను కూడా తమిళనాడు ప్రభుత్వం ప్రస్తావించింది. దీని ప్రకారం నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని వధించవచ్చని, కానీ, పూర్తిగా గోవధపై నిషేధం విధించే చట్టం లేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్లో హిందూ మక్కల్ కచ్చి సంస్థ యూత్ విభాగం సెక్రెటరీ కే.సూర్య, రాష్ట్ర డీజీపీని ప్రతివాదులుగా పేర్కొన్నారు. అంతకుముందు కే.సూర్య తరఫున గత మే 27న సుప్రీంకోర్టులో అడ్వకేట్ పీవీ యోగేశ్వరన్ పిటిషన్ దాఖలు చేశారు.తమిళనాడులో బక్రీద్ సందర్భంగా ఒక్క గోవును కూడా వధించకుండా చూడాలని కేవియట్ పిటిషన్లో కోరారు. దీనికి అనుగుణంగా సుప్రీంకోర్టు కూడా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఒక్క గోవును వధించకూడదని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ తాజాగా విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



అయోధ్య విరాళాల దుర్వినియోగం.. ఉద్యోగాల కోసం లంచం తీసుకున్నారా..

అయోధ్యలోని రామ మందిర విరాళాల దుర్వినియోగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై ప్రస్తుతం సమగ్ర విచారణ జరుగుతోంది. ఈ కేసులో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎసిట్) దృష్టి సారించింది. ఇప్పటికే అరెస్టైన నిందితులను విచారించగా అనిల్ మిశ్రా పేరు పలుమార్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. గత వారం ఆయన ట్రస్టీ పదవికి రాజీనామా చేశారు దర్యాప్తులో వెలుగుచూసిన వివరాల ప్రకారం.. రామ మందిరంలో పనిచేస్తున్న కనీసం 125 మంది ఉద్యోగులు అనిల్ మిశ్రా సిఫార్సుతోనే నియమితులయ్యారని అధికారులు అనుమానిస్తున్నారు. ఉద్యోగాల కోసం అనిల్ మిశ్రా లంచాలు కూడా తీసుకున్నారనే ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగిస్తోంది. అంతేకాకుండా, ట్రస్టీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆస్తులు ఎంత మేర పెరిగాయనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.ఈ కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రా ఉన్నారు. నిధులు కాజేయడంలో వీరి పాత్ర కూడా కీలకమైనదని, వీరిద్దరూ అనిల్ మిశ్రా బంధువులని అధికారులు భావిస్తున్నారు. కాగా, నిందితులు సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా ప్రత్యేక పద్ధతిని అనుసరించి నిధులను కాజేసినట్లు విచారణలో బయటపడింది ఒక వ్యక్తి నగదును తీసుకెళ్లే సమయంలో మిగిలినవారు అతడి చుట్టూ కెమెరాకు అడ్డుగా నిలబడేవారని అధికారులు తెలిపారు. నగదును సమీపంలోని బాత్రూమ్లో దాచిపెట్టి, అవకాశం దొరికినప్పుడల్లా బయటకు తీసుకెళ్లేవారని వెల్లడైంది. ట్రస్టు అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో వారిని ఎవరూ తనిఖీ చేయలేదని కూడా దర్యాప్తులో తేలిందిఇక, కౌంటింగ్ రూమ్కు చెందిన ఒక తాళం చెవి నిందితులలో ఒకడైన టిన్నూ యాదవ్ దగ్గరా, మరొకటి బ్యాంకు సిబ్బంది దగ్గర ఉండేది. నాలుగు విరాళాల పెట్టెలలో జమ చేసిన నగదును, 11 మంది బ్యాంకు సిబ్బంది, ఆలయ ట్రస్ట్ నుంచి మరో ముగ్గురితో సహా మొత్తం 14 మంది సభ్యుల బృందం లెక్కించేది. వీరందరి పాత్రపై ప్రస్తుతం సిట్ దర్యాప్తు సాగిస్తోంది.ఆలయంలో భద్రతా నిబంధనలు పాటించకపోవడం, సీసీటీవీ ఫుటేజీని నిర్ణీత కాలం పాటు భద్రపరచకపోవడంతో పాటు విరాళాల లెక్కింపు ప్రక్రియలో కూడా అనేక లోపాలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం





జూన్‌లో జోరుగా జీఎస్టీ వసూళ్లు.. రూ.1.94 లక్షలు దాటిన ఆదాయం

దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం (ఐూ ఎనిఞనీఎవ) రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది.వివరాల్లోకి వెళ్తే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది.దేశీయ వసూళ్ల వృద్ధిరేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధిరేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరాయి.ఎగుమతులపై 'ఐస్‌గేట్' (ఎఅఇఉఐఇ) ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టంచేస్తోంది.ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.



విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర.. ముగ్గురి అరెస్ట్..



తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ అధికారులు ఈ కుట్రపై దర్యాప్తు చేపట్టారు.టీవీకే పార్టీ ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా కొద్దిరోజుల క్రితం చెన్నై పోలీసులను ఆశ్రయించారు. చెన్నైకి చెందిన ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. 'తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్కు చెందిన వ్యక్తి నాతో చెప్పాడు. అలా చేస్తే 35 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పాడు' అని పేర్కొన్నాడు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు.అతడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక, ఈ వ్యవహారంపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ స్పందించారు. సెంథిల్ బాలాజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. 'సెంథిల్ బాలాజీతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కుట్రలో భాగం అయిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేయాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ముగింపు పలకాలి' అని అన్నారు.

పాటల హక్కుల వివాదం..

ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ



ఢిల్లీ ,ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 134 సినిమాల పాటల యాజమాన్య హక్కులకు సంబంధించిన కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గతంలో జారీ చేసిన మధ్యంతర నిషేధాజ్ఞను ఎత్తివేయాలని ఇళయరాజా దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ వివాదంలో ప్రముఖ సంగీత సంస్థ సారేగామా 134 చిత్రాల్లోని పాటలపై తమకే కాపీరైట్ హక్కులు ఉన్నాయని కోర్టుకు తెలిపింది. మరోవైపు, తాను స్వరపరిచిన పాటలపై తనకూ హక్కులు ఉన్నాయని ఇళయరాజా వాదిస్తున్నారు. ఈ అంశంపై ఇరు పక్షాల మధ్య న్యాయపోరాటం కొనసాగుతోంది.మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఇళయరాజా అభ్యర్థనను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వాటిని ఎత్తివేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కాపీరైట్ వివాదంపై తుది విచారణ పూర్తై.. తుది తీర్పు వెలువడే వరకూ ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని ఢిల్లీ హైకోర్టు వెల్లడించింది. ఈ కేసు తుది తీర్పు సంగీత పరిశ్రమలో కాపీరైట్ హక్కుల విషయంలో కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



ఢిల్లీ, జూలై 1: హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌పై రూ. 183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి.ఈ తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2,930 కి చేరింది. ఈ ధర నిన్నటి వరకూ రూ.3,113 గా ఉంది. ఇక, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఈ తగ్గింపునకు అనుగుణంగానే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు మారనున్నాయి. అయితే స్థానిక పన్నులకు (ఎయి) అనుగుణంగా ఆయా నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరల్లో స్వల్ప తేడాలు ఉంటాయి.

బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ పాలకమండలి సమావేశం

బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా మార్కెట్లో నెలకొన్న మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించి వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పలు ప్రతిపాదనలు చేసినట్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో అంతర్గత రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు, మరుగుదొడ్ల ఏర్పాటు కోసం కోటి 8 లక్షల రూపాయల ప్రతిపాదనలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు పంపినట్లు పేర్కొన్నారు. మన కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితులు పొడిగిస్తూ మార్కెట్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

స్పోర్ట్స్ న్యూస్

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్: అగ్రస్థానంలో ఇషాన్ కిషన్



టీ20 ర్యాంకింగ్స్ జాబితాను తాజాగా ఐసీసీ విడుదల చేసింది. ఇందులో టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ 876 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. కొంతకాలంగా టాప్‌లో కొనసాగుతున్న విధ్వంసకర ప్లేయర్ అభిషేక్ శర్మ(869) రెండో స్థానానికి పడిపోయాడు. అయితే వీరిద్దరూ మధ్య ఏడు రేటింగ్ పాయింట్ల తేడానే ఉండటం గమనార్హం.టీ20 ప్రపంచ కప్ 2026లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. టోర్నీలో పాకిస్థాన్‌పై మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అతడిని ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా చేయడానికి ఆ ఇన్నింగ్స్ ప్రధాన కారణం. కాగా టీ20ల్లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచిన నాలుగో భారత ప్లేయర్‌గా ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఇంతకు ముందు విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ ఈ ఘనత సాధించారు.

ర్యాంకింగ్స్‌లో ఐర్లాండ్ ప్లేయర్లు..

భారత్‌పై ఐర్లాండ్ చారిత్రక విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ర్యాంకింగ్స్‌లో ఐర్లాండ్ ప్లేయర్లకు మంచి ఫలితం కనిపించింది. లార్కన్ టక్కర్ నాలుగు స్థానాలు ఎగబాకి 77వ స్థానానికి చేరుకోగా.. రాస్ అడైర్ ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 84వ స్థానంలో నిలిచాడు. బౌలింగ్ విభాగంలో ఐర్లాండ్ పేసర్ మార్క్యూ హంఫ్రీస్ రెండు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు తీసి కెరీర్ బెస్ట్ 25వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబే మూడు స్థానాలు ఎగబాకి టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో ఏడో స్థానంలో నిలిచాడు. ఐర్లాండ్‌కు చెందిన గారెత్ డెలానీ, హ్యారీ టెక్టర్ వరుసగా 24, 38వ స్థానాలకు చేరుకున్నారు.

టెస్టుల్లో ట్రావిస్ హెడ్‌కు అగ్రస్థానం

ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కూడా కీలక మార్పులు చోటు చేసుకుంది. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ తొలిసారి ప్రపంచ నంబర్ వన్ టెస్టు బ్యాటర్‌గా అవతరించాడు. న్యూజిలాండ్‌తో ట్రెంట్ బ్రిడ్జ్ టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్లు హ్యారీ బ్రూక్, జో రూట్ ఆశించిన స్థాయిలో రాణించని సంగతి తెలిసిందే. దీంతో బ్రూక్ రెండు, రూట్ మూడో స్థానానికి పడిపోయారు. న్యూజిలాండ్ ప్లేయర్లు రచిన్ రవీంద్ర ఏడో స్థానానికి, డారిల్ మిచెల్ 11వ స్థానానికి, డెవాన్ కాన్వే 14 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 15వ స్థానానికి, టామ్ లాథమ్ సంయుక్తంగా 31వ స్థానానికి చేరుకున్నారు. టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మళ్లీ ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించాడు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మ్యాట్ హెన్రీని అధిగమించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు.

శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేసిన కేరళ క్రికెట్ అసోసియేషన్



కేరళ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేశారని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌పై మూడేళ్ల నిషేధం పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ నిషేధాన్ని కేసీఏ ఎత్తివేసింది. అతడు బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీశాంత్‌ను హెచ్చరించింది.గతంలో కేసీఏ ప్రతిష్ఠకు భంగం కలిగించే శ్రీశాంత్ వ్యాఖ్యలు చేశాడు. దీంతో అతడిపై కేసీఏ మూడేళ్ల నిషేధం విధించింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ తిరువనంతపురం మున్సిఫ్ కోర్టును ఆశ్రయించాడు. కానీ కోర్టు అతడి పిటిషన్‌ను కొట్టేసింది. ఆ తర్వాత శ్రీశాంత్ కేసీఏకు అధికారికంగా క్షమాపణ చెప్పాడు. తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి విచారం వ్యక్తం చేశాడు. దీనిపై నేడు(బుధవారం) కేసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో చర్చించి.. అతడిపై నిషేధం ఎత్తివేయాలని నిర్ణయించారు. దీంతో కేరళ క్రికెట్ లీగ్ (కేసీఎల్) మూడో సీజన్‌లో ఏరీస్ కొల్లం సెయిలర్స్ ఫ్రాంచైజీ సహ యజమానిగా శ్రీశాంత్ కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

ఫిఫా ప్రపంచ కప్ సంబరాల్లో విషాదం.. ఇద్దరి మృతి



ఫిఫా ప్రపంచ కప్ 2026లో సహ ఆతిథ్య దేశం మెక్సికో రౌండ్ ఆఫ్ 16కి అర్హత సాధించింది. 2-0తేడాతో ఈక్వెడార్‌ను చిత్తు చేసింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత ప్రపంచ కప్‌లో నాకౌట్ దశను దాటింది. దీంతో అభిమానులు భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అయితే ఈ వేడుకలు విషాదంగా మారాయి. బుధవారం జరిగిన ఈ సంబరాల్లో ఊపిరాడక ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని మెక్సికో ప్రభుత్వం ధ్రువీకరించింది.మృతుల్లో 19 ఏళ్ల యువతి, 44 ఏళ్ల వ్యక్తి ఉన్నట్లు అక్కడి ఆరోగ్య శాఖ వెల్లడించింది. అభిమానులు భారీ ఎత్తున సంబరాల్లో పాల్గొనడంతో ఉద్రిక్తత నెలకొంది. ఒకరినొకరు నెట్టేసుకోవడంతో ఊపిరాడక ఆ ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే, ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా మృతిచెందినట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కానీ ఈ విషయాన్ని అధికారులు ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ ఘటనలో చాలా మంది తీవ్ర గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఖరీదైన ఉంగరం ధరించి అందరినీ ఆకర్షించిన సెరెనా విలియమ్స్!



స్పోర్ట్స్ డెస్క్: టెన్నిస్ దిగ్గజం, 44 ఏళ్ల సెరెనా విలియమ్స్ దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత ప్రొఫెషనల్ సింగిల్స్ కోర్టులోకి ఘనంగా పునరాగమనం చేశారు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో వింబుల్డన్ ఛాంపియన్‌షిప్స్-2026 ద్వారా కోర్టులోకి ఎంట్రీ ఇచ్చారు. సెంటర్ కోర్టులో జరిగిన రౌండ్-1 ఉత్కంఠభరిత పోరులో ఈ అమెరికా స్టార్ ఓటమిపాలైనప్పటికీ.. తన ఆటతోనే కాకుండా స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టినీ ఆకర్షించారు. 2 గంటల 22 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో సెరెనా ధరించిన ఖరీదైన రింగ్, వాచ్ అందరినీ ఆకర్షించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆమె ధరించిన ఈ ఖరీదైన వస్తువులపైనే చర్చ నడుస్తోంది.ఈ మ్యాచ్‌లో సెరెనా చేతికి ఉన్న డైమండ్ రింగ్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంది. తన భర్త, రెడ్డిట్ సహ వ్యవస్థాపకుడు అలెక్సిస్ ఒహానియన్ ఇచ్చిన ఈ నిశ్చితార్థపు ఉంగరం విలువ సుమారు 3 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 25 కోట్లు) ఉంటుందని అంచనా. ఇందులో 17 క్యారెట్ల ఓవల్-కట్ వైట్ డైమండ్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో పాటు ఆమె ప్రత్యేకంగా చేయించుకున్న నెయిల్ మానిక్యూర్ (గ్లేజ్డ్ క్రోమ్ ట్రెండ్) ఫ్యాషన్ ప్రియులను ఫిదా చేసింది. మరోవైపు ఆమె మణికట్టుకు ఉన్న ఖరీదైన డైమండ్ వాచ్ కూడా ప్రత్యేకంగా నిలిచింది.స్విస్ వాచ్ మేకర్ ఆడెమర్స్ పిగ్యుట్ రూపొందించిన 'రాయల్ ఓక్ ఆఫ్‌షోర్ సెల్ఫ్ వైండింగ్ క్రోనోగ్రాఫ్' వాచ్‌ను ఈ అమెరికా స్టార్ ధరించారు. వైట్ గోల్డ్‌తో తయారై, పింక్ యాక్సెంట్స్, 32 బ్రిల్లియంట్ కట్ వజ్రాలతో మెరిసిపోతున్న ఈ వాచ్.. వింబుల్డన్ సాంప్రదాయ తెల్ల దుస్తులకు సరిగ్గా సరిపోయింది. సెంటర్ కోర్టులో డేవిడ్ బెక్హాం, రోమియో బెక్హాం (పాటెక్ ఫిలిప్) వంటి ప్రముఖులు లగ్జరీ వాచ్‌లతో కనిపించినప్పటికీ.. సెరెనా ధరించిన వాచ్ వాటన్నింటికంటే ప్రత్యేకంగా నిలిచి ఫ్యాషన్‌పై ఆమెకు ఉన్న మక్కువను చాటిచెప్పింది.

వైభవ్ విషయంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన శ్రేయస్



స్పోర్ట్స్ డెస్క్: వైభవ్ సూర్యవంశీకి టీమిండియా అరంగేట్రం చేసే అవకాశం ఇవ్వకపోవడంపై పెద్ద వివాదం కొనసాగుతోంది. ఆ సిరీస్‌లో వైభవ్ తప్పక అరంగేట్రం చేస్తాడని అందరూ అనుకున్నా, చివరికి అతడికి తుదిజట్టులో చోటు దక్కలేదు. దీంతో టీమిండియా మేనేజ్‌మెంట్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెచ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదంలోకి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఎంట్రీ ఇచ్చి... వైభవ్‌ను ఐర్లాండ్ సిరీస్‌లో ఆడించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రేయస్ అయ్యర్, గౌతమ్ గంభీర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు.గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై భారత జట్టు టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తాజాగా స్పందించాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ.. తాను సోషల్ మీడియా లేదా న్యూస్ ఛానల్స్ నుంచి వచ్చే ఒత్తిడిని పట్టించుకోనని అన్నాడు. జట్టు అవసరాలు, ప్రదర్శన ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నాడు. దీంతో వైభవ్ అరంగేట్రంపై వస్తున్న రాజకీయ ఒత్తిడిని, వ్యాఖ్యలను శ్రేయస్ అయ్యర్ నేరుగానే తిప్పికొట్టాడని క్రీడా నిపుణులు అంటున్నారు.మరోవైపు ఇవాళ ఇంగ్లండ్‌తో జరుగబోయే తొలి టీ20లోనూ వైభవ్ అరంగేట్రం చేయడని టాక్ వినిపిస్తోంది. భారత మేనేజ్‌మెంట్, కోచ్, కెప్టెన్ అందరూ ముక్తకంఠంతో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌కు వత్తాసు పలుకుతున్నారని సమాచారం. దీన్ని బట్టి ఇవాళ్టి మ్యాచ్‌లోనూ వైభవ్ అరంగేట్రం లేనట్లేనని తెలుస్తోంది. దీంతో మరోసారి టీమిండియా అభిమానులు సైతం అసంతృప్తిగా ఉన్నారు.

న్యూజిలాండ్ జట్టు ప్రకటన.. రీఎంట్రీ ఇచ్చిన ఆర్సీబీ స్టార్ ప్లేయర్!

స్పోర్ట్స్ డెస్క్: వెస్టిండీస్‌తో త్వరలో జరగబోయే ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఇవాళ (బుధవారం) తమ జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌కు వ్యక్తిగత కారణాల వల్ల దూరమైన కివీస్ స్టార్ పేసర్, ఆర్సీబీ కీలక ప్లేయర్ జాకబ్ డఫీ(ఐపీఎల్ 2026) మళ్లీ జట్టులోకి వచ్చాడు.ప్రస్తుతం న్యూజిలాండ్ క్రికెట్ జట్టులో 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా ఉంటూ, ప్రతిష్ఠాత్మక 'సర్ రిచర్డ్ హాడ్లీ మెడల్' విన్నర్ అయిన డఫీ రాకతో ఆ జట్టు బౌలింగ్ బలం పుంజుకుంది. టీ20 ప్రపంచకప్2026 ఫైనల్ తర్వాత డఫీ మళ్లీ బ్లాక్ క్యాప్స్ జెర్సీని ధరించబోతున్నాడు. అతనితో పాటు 26 ఏళ్ల మాట్ ఫిషర్ కూడా పేస్ విభాగానికి ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌పై 2-1తేడాతో టెస్ట్ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన నాథన్ స్మిత్(16 వికెట్లు)తో పాటు బెన్ సియర్స్ ఈ వన్డే సిరీస్‌కూ ఎంపికయ్యారు.అయితే, పనిభారం కారణంతో సీనియర్ బౌలర్లు కైల్ జేమీసన్, మాట్ హెన్రీ, విల్ ఒరుర్కేలకు బోర్డు విశ్రాంతినిచ్చింది. అలాగే చీలమండ సర్జరీ కారణంగా బ్లెయిర్ టిక్నర్ జట్టుకు దూరం కాగా.. రెండోసారి తండ్రైన డెవాన్ కాన్వేకు కుటుంబంతో గడిపేందుకు విశ్రాంతి ఇచ్చారు. మరో స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర 'మేజర్ లీగ్ క్రికెట్' (ఓఓఅ) ఆడటానికి బోర్డు అనుమతించింది. ఈ సిరీస్‌కు మిచెల్ శాంట్నర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.



న్యూజిలాండ్ వన్డే జట్టు:

మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, క్రిస్టియన్ క్లార్క్, జేకబ్ డఫీ, మాట్ ఫిషర్, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మిచ్ హే, నిక్ కెల్లీ, టామ్ లాథమ్, జైడెన్ లెనాక్స్, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, బెన్ సియర్స్, నాథన్ స్మిత్, విల్ యంగ్.

సినిమా

"కళ్యాణం కమనీయం జీవితం" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్



వివిఫై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి అవంచ హీరోయిన్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కళ్యాణం కమనీయం జీవితం. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. హీరో హీరోయిన్ లకు సినిమా టీమ్ కు అల్ ది బెస్ట్ అని అన్నారు

నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ : విజయేంద్ర ప్రసాద్ గారు అడగగానే మా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది ఆయనకు నా కృతజ్ఞతలు. డైరెక్టర్ కథ చెప్పగానే తప్పకుండా ఈ సినిమా చేయాలి అనిపించింది. దర్శకుడు చెప్పిన విధంగా సినిమా తీశాడు సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు

మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ పాన్ వరల్డ్ స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు పోస్టర్ ను ఆవిష్కరించి టీమ్ కు బ్లెస్సింగ్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది మంచి కథ, కథనాలతో సినిమాని తెరకెక్కించాము త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అన్నారు

దర్శకుడు రవి లోకిరెడ్డి మాట్లాడుతూ: విజయేంద్ర ప్రసాద్ గారు మా పోస్టర్ ని ఆవిష్కరించడంతో నే మా సినిమా సక్సెస్ అయినంత ఆనందంగా వుంది. నిర్మాతలు నా కథను నమ్మి నాకు అవకాశం ఇచ్చారు వారి కృతజ్ఞతలు. ప్రేమ సస్పెన్స్ కలయికతో ఒక ఉత్కంఠ భరితంగా సినిమా వుంటుంది.అలాగే మా టీమ్ అంతా కలిసి ఒక మంచి ప్రయత్నం చేసాము ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను అన్నారు

నటీనటులు : ఖాన్ దురాని, సాహితీ అవంచ , ఉదయ్ పులిమి, విషిక, సత్యానంద్ లంక, కాకినాడ నాని, ధనలక్ష్మి బల్ల తదితరులు

కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.38.36 కోట్లకు చేరుకున్నాయి.విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ.17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం విశేషం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా యాక్షన్, ఫ్యామిలీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, శ్రీముఖి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్



అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గ్దదె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

నాగబంధం' మూవీలో ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్ చేశాను : హీరోయిన్ నభా నటేష్

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం ? ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ నభా నటేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



నాగబంధంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

-ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా నిలబడే వ్యక్తిత్వం ఆమెది. కథలో నా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. పార్వతి తీసుకునే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. నా పాత్ర చూసి ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ అవుతారు.

ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది కదా... దాని గురించి చెప్పండి?

-ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది. నిజంగా ఆ పాట బిగ్ స్క్రీన్‌పై అద్భుతంగా కనిపిస్తుంది. అలాంటి పాటను నేను ఇప్పటివరకు చేయలేదు. అది నాకు చాలా కొత్త అనుభవం.

-టెక్నికల్‌గా కూడా అంత పెద్ద కాన్వాస్‌పై ఆ పాటను చిత్రీకరించడం ఒక ఛాలెంజ్. అది కేవలం డాన్స్ సాంగ్ మాత్రమే కాదు... అందులో భక్తి భావం కూడా కనిపించాలని దర్శకుడు, కొరియోగ్రాఫర్‌కు ముందుగానే సూచించారు. ఆ పాట కోసం వేసిన సెట్ నిజంగా ఒక పండుగ వాతావరణాన్ని గుర్తు చేస్తుంది. బృందావనంలో గోపికలంతా కలిసి ఆనందంగా వేడుక చేసుకుంటే ఎలా ఉంటుందో, ఆ సెట్లో పాట చిత్రీకరణ సమయంలో కూడా అలాంటి అనుభూతే కలిగింది. ఆర్ట్ డైరెక్షన్ అద్భుతంగా జరిగింది.

-ఈ సినిమా కోసం నిర్మించిన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్ నిజంగా ఆలయంలోకి వెళ్లిన అనుభూతిని కలిగిస్తుంది. ఆ సెట్‌ను చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ప్రేక్షకులను కూడా ఆ విజువల్స్ తప్పకుండా మెస్మరైజ్ చేస్తాయి.

డైరెక్టర్ అభిషేక్ నామా గారి గురించి?

-అభిషేక్ గారికి చాలా క్లియర్ విజన్ ఉంది. ఆయన ఈ కథను చాలా అద్భుతంగా ఊహించుకున్నారు. ప్రతి విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. కాస్ట్యూమ్స్, హెయిర్ స్టైల్... ప్రతి చిన్న విషయాన్ని కూడా చాలా డీటెయిల్‌గా డిజైన్ చేశారు.

-అభిషేక్ గారు కథ చెప్పినప్పుడే నేను మెస్మరైజ్ అయ్యాను. ఆయన ప్రతి సీన్‌కు స్టోరీబోర్డ్ సిద్ధం చేసుకున్నారు. ప్రతి పాత్ర యాక్షన్, రియాక్షన్‌లను ముందుగానే స్కెచ్ చేసి రెడీ చేశారు. ఆయన చేసిన ప్రీ-ప్రొడక్షన్ వర్క్ అద్భుతం.షూటింగ్‌లో కూడా ప్రతి సన్నివేశాన్ని ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన విజన్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలి. నేను కూడా ప్రేక్షకుల్లాగే ఈ సినిమాను చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

-ఈ సినిమాలో నా పాత్ర కోసం రెడీ అవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఈ షూటింగ్‌ను నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం చాలా అరుదుగా వస్తుంది.

-ఈ సినిమా కోసం దాదాపు పది భారీ సెట్లు వేశారు. ప్రతి సెట్ ఒకదానికొకటి భిన్నంగా ఉంటుంది. ఇలాంటి భారీ చిత్రంలో నటించడం ఒక నటిగా నాకు గొప్ప అనుభవం. నాగబంధంలో 'నమోరే' పాటతో పాటు మరో జానపద గీతం కూడా చేశాను. ఈరెండు పాటలు కూడా విజువల్‌గా చాలా గ్రాండ్‌గా ఉంటాయి.

-అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేమంతా చాలా నియమనిష్టలతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం. అలాగే అక్కడ ఒక అర్చకుడిని నియమించి ప్రతిరోజూ పూజలు చేసిన తర్వాతే షూటింగ్ ప్రారంభించేవాళ్లం.

ఇందులో మీ పాత్రలో రొమాన్స్ కూడా ఉంటుందా?

-రొమాన్స్ ఉంటుంది. అయితే దానికంటే చాలా ముఖ్యమైన అంశాలు నా పాత్రలో ఉంటాయి. అవే కథకు కీలక మలుపు తీసుకొస్తాయి. ప్రేక్షకులు తప్పకుండా సర్ప్రైజ్ అవుతారు. కథకు బలం చేకూర్చే పాత్రలో కనిపిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలకు పూర్తిగా భిన్నమైన పాత్ర ఇది. ఈ పాత్ర చేసినందుకు చాలా గర్వపడుతున్నాను.

నిర్మాతల గురించి?

తొలి సినిమానే అయినప్పటికీ కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో దాదాపు రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రతి విషయంలో రాజీ పడకుండా, కంటెంట్‌కు తగ్గట్టుగా సినిమాను తీర్చిదిద్దారు.

ప్రమోషన్స్ కూడా చాలా వినూత్నంగా చేశారు. అనంత పద్మనాభస్వామి రథయాత్ర అనే ఆలోచన చాలా ప్రత్యేకంగా ఉంది. వేలాది మంది భక్తులు ఆ యాత్రలో పాల్గొంటున్నారు. అక్కడ వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. తొలి సినిమానే అయినప్పటికీ ఇంత గ్రాండ్‌గా నిర్మించి, ప్రచారం చేయడం మామూలు విషయం కాదు.

-ఈ సినిమాలోని వీఎఫ్ఎక్స్ వర్క్ చాలా కొత్త రియల్ గా అనిపిస్తుంది. ఇప్పటికే అందరూ వీఎఫ్ఎక్స్‌ను ప్రశంసిస్తున్నారు. నిజంగా అద్భుతమైన ఔట్‌పుట్ వచ్చింది.

విరాట్ కర్ణ గారి గురించి?

-విరాట్ కర్ణ చాలా ప్యాషన్, డెడికేషన్ ఉన్న నటుడు. ఇది ఆయన రెండో సినిమా అని అనిపించదు. ఎంతో అనుభవం ఉన్న నటుడిలా నటించారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన పడిన కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. విరాట్‌తో కలిసి నటించడం చాలా మంచి అనుభవం.

డీవోపీ సౌందర్ రాజన్ గారి గురించి?

సౌందర్ రాజన్ గారు చాలా అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఆయన చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. నిజంగా ప్రేక్షకులు విజువల్స్ చూసి ఆశ్చర్యపోతారు. ప్రతి ఫ్రేమ్ కూడా మెస్మరైజ్ చేసేలా ఉంటుంది.

'ఇస్మార్ట్ శంకర్' తర్వాత మీరు అంత వేగంగా సినిమాలు చేయకపోవడానికి కారణం?

-నాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దాని వల్ల భుజానికి గాయం అయింది. ఆ కారణంగా దాదాపు ఏడాదిన్నర పాటు బ్రేక్ తీసుకున్నాను. ఫిజికల్‌గా, మెంటల్‌గా పూర్తిగా స్ట్రాంగ్‌గా ఉన్నప్పుడే సినిమాలు చేయాలి. స్క్రీన్‌పై ఎనర్జీతో కనిపించినప్పుడే పాత్రకు న్యాయం చేయగలనని భావిస్తాను. అందుకే పూర్తిగా కోలుకున్న తర్వాతే మళ్లీ నటించడం ప్రారంభించాను.

'నాగబంధం' షూటింగ్ అనుభవం?

-నాగబంధం చాలా భారీ స్థాయి సినిమా. ప్రతిరోజూ షూటింగ్‌లో దాదాపు 200 మంది ఉండేవారు. ప్రతి షెడ్యూల్‌కు సినిమా స్కేల్ మరింత పెరుగుతూ వెళ్లింది. ఈ సినిమాతో టీమ్ వర్క్ ఉంటే ఏదైనా సాధించవచ్చని నేను నేర్చుకున్నాను.

స్వయంభూలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు కదా?

-అవునండి. ఇలాంటి రెండు భారీ చిత్రాల్లో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ రెండు కూడా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు చూడదగ్గ సినిమాలు. అలాంటి రెండు చిత్రాల్లో భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది. ఒక నటిగా నాకు చాలా సంతృప్తిగా ఉంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844